క్లుప్తంగా

ముంపు కాలనీల్లో సహాయక చర్యలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో గోదావరి వరదలు, బ్యాక్ వాటర్ కారణంగా ముంపునకు గురైన వరద నీరు తగ్గిన క్రమంలో ఆయా కాలనీల్లో సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బంది విస్తృతంగా చర్యలు చేపట్టారు. వరద వచ్చిన వెళ్లిన తరువాత దుర్వాసన వచ్చి ప్రజలు, దోమల బెడద కారణంగా విషజ్వరాలు రాకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది విస్తృతంగా బ్లీచింగ్ చల్లారు. అదే విధంగా కరకట్ట వద్ద ఉన్న కల్యాణకట్ట వద్ద కూడా ఇటీవల వచ్చిన గోదావరి వరద ఉధృతి తగ్గిపోవడంతో ఆ ప్రాంతం అంతా బురద పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు దగ్గరుండి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

అవగాహన సదస్సు

అశ్వాపురం: జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అమ్మగారిపల్లి బీట్ పరిధిలోని రాయన్‌పేట గ్రామంలో సోమవారం గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వన్యప్రాణుల వేటాడవద్దని గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో అటవీ శాఖ రేంజర్ రమేష్, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మణుగూరుటౌన్: సైబర్ నేరాలతో పాటు అపరిచితుల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని సురక్షాబస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో పాటు స్థానికులకు సైబర్ నేరాలతో పాటు నూతన చట్టాల అమలు తీరును డ్రగ్స్ వినియోగం నిరోధించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అదే విధంగా డ్రగ్స్ వినియోగాన్ని నివారించే క్రమంలో పౌరుల బాధ్యతలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మేడప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

అశ్వారావుపేట: వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలో బదిలీ అయిన ఉద్యోగులకు సోమవారం ఆశ కార్యకర్తలు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. అశ్వారావుపేట సూపర్‌వైజర్ శ్రీనివాస్ వేంసూరు పీహెచ్‌సీకి, ఎంపీహెచ్‌ఏ చిలకమ్మ వైరా పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. వారిని ఘనంగా సన్మానించిన అశ్వారావుపేట ఆశ కార్యకర్తలు వారితో గత 13ఏళ్లుగా ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గోపాల్, ప్రసాద్, ఆశ కార్యకర్తలు పావని, అన్నపూర్ణ, రమాదేవి, స్రవంతి, మంగ, రాములమ్మ, బూదెమ్మ, దుర్గ, ప్రభావతి పాల్గొన్నారు.

ఏపీపీ దుర్గాబాయి బదిలీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రథమశ్రేణి కోర్టులో 9 ఏళ్లుగా ఏపీపీగా విధులు నిర్వహించి హన్మకొండకు దుర్గాబాయి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కోర్టు ఆవరణలో భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాబాయికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. 9 ఏళ్లలో దుర్గాబాయి ఎందరో మన్ననలు పొందారని ఆయన అన్నారు. కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు రమణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, జాయింట్ కార్యదర్శి విద్యాధరి, మాజీ బార్ అధ్యక్షులు దేవదానం తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ జేఏసీ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలోని గ్రామగ్రామాన ఆదివాసీ దినోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలన్నారు. ఆదివాసీ ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు, యువత అందరూ జాతీ ఐక్యతను చాటుతూ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9న ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేత్రదానం..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని మసీద్ సెంటర్‌లో నివాసం ఉండే కొంజర్ల వెంకట నాగేశ్వరరావు (48) సోమవారం గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఈ క్రమంలో అతని కుటుంబ సభ్యుల ముందు చూపుతో మరో ఇద్దరికి చూపును ఇవ్వాలని ఆలోచనతో కొంజర్ల వెంకట నాగేశ్వరరావు రెండ నేత్రాలను దానం చేశారు. ఈ ప్రక్రియను అంతా వ్యక్తి మృతి చెందిన 8 గంటల లోపు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో నాగేశ్వరరావు రెండు నేత్రాలను హైదరాబాద్‌కు చెందిన అగర్వాల్ ఐ బ్యాంక్ సంస్థ రిప్రెసెంటేటివ్ జానీకి అందజేశారు. కాగా ఈ రెండు నేత్రాలను 4 రోజుల లోపు అవసరమున్న వ్యక్తులకు వీటిని దానం చేసే వీలున్నట్లు అగర్వాల్ ఐ బ్యాంక్ సంస్థ రిప్రెసెంటేటివ్ జానీ తెలిపారు. భద్రాచలం పరిసరాలలో ఉండే ప్రజలు తమ కుటుంబ సభ్యులు మృతిచెందిన తరువాత ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వారు 7288084777 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా ఆ సంస్థ బాధ్యులు తెలిపారు.

సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం

- లక్ష్య సాధనకు కృషి చేస్తున్న సీఎండీ
- పుట్టిన రోజు వేడుకల్లో అధికారులు


మొక్కలు నాటుతున్న మణుగూరు ఏరియా అధికారులు

మణుగూరుటౌన్: సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి సింగరేణి సీఅండ్ఎండీ బలరాం నాయక్ ఎంతో సహకరిస్తున్నారని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అభివర్ణించారు. సోమవారం సీఅండ్ఎండీ బలరాం నాయక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పీకేఓసీ-2తో పాటు మణుగూరు ఓసీలో అధికారులంతా కలిసి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం రాంచందర్, సీఎంఓఏఐ అధ్యక్షుడు, పీకేఓసీ పీవో లక్ష్మీపతిగౌడ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, రమేశ్, వెంకటరావు, మదన్‌నాయక్, శ్రీనివాసమూర్తి, అనురాధ, వీరభద్రుడు, అబ్దుల్ షబ్బీరుద్దీన్, మదార్ సాహెబ్, సాయిల సురేశ్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు రాంగోపాల్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: సింగరేణి సీఅండ్ఎండీ ఎన్.బలరాం జన్మదిన సందర్భంగా సింగరేణి క్యాలరీస్ మణుగూరు ఏరియాలోని 132కేవీ సబ్ స్టేషన్ సమీపంలో సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కె.గురుమూర్తి, కె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్, యు.శివరామకృష్ణ, ఎం.టైసన్, కె.నాగరాజు, కుంజా శ్రీను, బి.శ్రీనివాస్, ఎస్‌కె.రజబ్ అలీ, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్


భద్రాచలంఅర్బన్: చర్ల రోడ్డులో ఆటో డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న ఎస్సై మధుప్రసాద్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై సోమవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు కూర్చుని డ్రైవింగ్ చేసినా, ట్రాఫిక్ రూల్స్ పాటించక పోయినా భారీ మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్‌ఐలు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామ చివారులో ఎస్‌ఐ వెంకటప్పయ్య సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అపరిచిత వ్యక్తుల సమాచారాన్ని రాబట్టారు. మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా మండల వ్యాప్తంగా విస్తృత తనిఖీలను పోలీసులు చేపట్టారు. మండల సరిహద్దులోనే ఛత్తీస్‌గఢ్ అనుకుని ఉండటంతో వారోత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేశారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన


సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు

చర్ల: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం చర్లలో అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీనివాస్ చర్లలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ప్రతినిధులు.. గోదావరి వరదలు, పిడుగుపాట్లు, రోడ్డు ప్రమాదాలు, పాముకాట్లు తదితర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సదస్సుకు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌తో పాటు ఎంపీడీఓ ఈదయ్య, మండల వ్యవసాయశాఖాధికారి పి.శివరాంప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీఏ చైతన్యతో పాటు మండల పరిషత్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, విద్యార్థులు, అగంన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 2న సర్వసభ్య సమావేశం

చర్లరూరల్: ఆగస్టు 2న చర్ల మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.ఈదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి జూన్ 2024 వరకు ప్రగతి నివేదికలను 31జులై, 2024 నాటికి కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, ప్రత్యేక అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

లింగన్న ఆశయసాధనకు ఉద్యమించాలి


లింగన్న వర్ధంతి సభలో నాయకుల నినాదాలు

బూర్గంపాడు: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు, అమరజీవి కామ్రేడ్ లింగన్న ఆశయ సాధనకు ఉద్యమించాలని ఆ పార్టీ డివిజన్ నాయకులు వైఎస్ రెడ్డి పిలుపునిచ్చారు. కామ్రేడ్ లింగన్న 5వ వర్ధంతి సభను సోమవారం మోతె గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల పక్షాన పోరాడుతున్న లింగన్నను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హతమార్చారన్నారు. కార్పొరేట్ శక్తుల ఖనిజ దోపిడీని అడ్డుకుని ఆదివాసీల అభ్యున్నతికి పోరాడిన లింగన్న ఆశయాల సాధనకు పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగన్, ఇడమ రాజు, బుగ్గ రామకృష్ణ, భద్రయ్య, ముత్తయ్య, భీముడు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేద్దాం

చంద్రుగొండ: అమరుల ఆశయాల సాధన కోసం కృషి చేద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీపార్టీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రం చంద్రుగొండలో ఆదివారం జరిగిన పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తూ అసువులుబాసిన మహనీయుల ఆశయాలను నిలుపుదామన్నారు. ఈ క్రమంలోనే లింగన్న సంస్మరణ సభలను గ్రామగ్రామాన జరుపుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వరికూటి వెంకట్రావ్, పగడాల కోటేశ్వరరావు, యం రంగారెడ్డి, తోలెం వెంకటేశ్వర్లు, బాలు, ఎస్‌కె.జరీనాబేగం పాల్గొన్నారు.

సాయినగర్‌లో జ్వర సర్వే

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయితీ సాయినగర్‌లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటింటిని సందర్శించి ప్రజల వివరాలు, జ్వర పీడితుల వివరాలను సేకరించారు. అనంతరం పరిసరాలను పరిశీలించి.. నీరు నిల్వ ఉన్న తొట్లను, ప్లాస్టిక్ కంటైర్లను శుభ్రం చేయించారు. వర్షాకాల నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని ప్రజలకు సూచించారు. వైద్య సిబ్బంది రాంప్రసాద్, విజయ, ఆశా వర్కర్లు శైలజ, భవాని, స్రవంతి, లక్ష్మి, దుర్గా పాల్గొన్నారు.

చర్లరూరల్: మండలంలోని సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలోని తేగడ గ్రామంలో సోమవారం వైద్య సిబ్బంది ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. జ్వరాలు సోకిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు.

నేడు దివ్యాంగులకు బస్ పాస్‌ల మేళా

మణుగూరురూరల్: పట్టణంలోని సురక్షాబస్టాండ్‌లో టీజీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపో ఆధ్వర్యంలో నేడు దివ్యాంగులకు రాయితీ బస్ పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్యాంసుందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సురక్షా బస్టాండ్ ఉదయం 10గంటలకు మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. రాయితీ బస్ పాస్‌లతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో 50శాతం రాయితీపై రాష్ట్ర మంతటా దివ్యాంగులు ప్రయాణించవచ్చన్నారు. ఈ రాయితీ కోసం దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో పాటు ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో పాటు రూ.50లు వెంట తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7382859142, 7659823007 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

బూర్గంపాడు: గోదావరి వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారమందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు కోరారు. సారపాకలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు గోదావరి వరదలతో ప్రతిఏటా రైతులు పంటలు నష్టపోతున్న ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందటం లేదన్నారు. అదేవిధంగా గోదావరి వరదలతో ఇళ్లలో నీరు చేరి నిరాశ్రయులైన బాధితులకు ప్రభుత్వం మెరక ప్రాంతాలలో పక్కా ఇళ్లు నిర్మించాలని కోరారు. గోదావరి వరదల నివారణకు బూర్గంపాడు మండలం వైపు కరకట్టలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బయ్యా రాము,కమటం మరియమ్మ, కుంజా రాంబాబు, పాండయ్య, రమాదేవి, శ్రీరాములు, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలన మీద శ్రద్ధ లేదు


పినపాక: సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

పినపాక: కాంగ్రెస్ పార్టీ నాయకులకు పదవుల మీద ఉన్న శ్రద్ధ పాలన మీద లేదని పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మండల టీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అటకెక్కాయని, అధికారులు గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు లేక ఇతర ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేకి ధనార్జన తప్ప ప్రజల సమస్యలపై అవగాహన లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, ఆత్మ చైర్మన్ భద్రయ్య తదితరు నాయకులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయితీ గొల్ల కొత్తూరు గ్రామంలో రైతు కుటుంబానికి చెందిన వృద్ధ దంపతులు కాసరబాద రామచంద్రయ్య-సరోజినిలు ఆదివారం రాత్రి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు వారి గృహానికి వెళ్లి మృతదేహాలను సందర్శించి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వట్టం రాంబాబు, కుంటా లక్ష్మణ్, ముద్దంగుల కృష్ణ, అక్కి నరసింహారావు, పప్పుల ప్రసాద్, రావుల చంద్రయ్య పాల్గొన్నారు.


నిత్యావసరాల వితరణ

అశ్వారావుపేట: పెద్దవాగు ప్రాజెక్టు బాధితులకు నిత్యావసరాలను, కాంగ్రెస్ నాయకులు వితరణగా అందజేశారు. అశ్వారావుపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, జేష్ఠ సత్యనారాయణ చౌదరి ఆధ్వర్యంలో వాగు ఉధృతిలో నష్టపోయిన సుమారు 70 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలను సోమవారం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కోఆప్షన్ పాషా, సత్యవరపు బాలయ్య, కోడూరి శ్రీనివాసరావు, సింహాచలం, భూక్య ప్రసాద్, బద్దె చిట్టియ్య, జీవనరావు, మణిరాజు, మెకానిక్ వెంకన్న, యూత్ కాంగ్రెస్ అకిరిపల్లి రాంబాబు, గండికోట రాంబాబు, వల్లెపు సురేష్, దేరంగుల సోమయ్య, తమ్మిశెట్టి శ్రీను, తదితర కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

పినపాక: వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ సమతుల్యత ప్రతి ఒక్కరి బాధ్యతని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎఫ్ఆర్‌ఓటీ ద్వాలియ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం బయ్యారం క్రాస్ రోడ్‌లో అంతర్జాతీయ పులుల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. బయ్యారం క్రాస్ రోడ్ నుండి ఫారెస్ట్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, సీహెచ్ అరుణ, బీట్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పులుల సంరక్షణపై బయ్యారం క్రాస్ రోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్ట్ అధికారులు

యాత్రను జయప్రదం చేయండి

మణుగూరురూరల్: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణిపరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సత్రపల్లి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలను ఆయన ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేసి, సింగరేణికి, కార్మికవర్గానికి తీరని అన్యాయం చేస్తోందని అన్నారు. ఆగస్టు 3వ తేదీన మణుగూరులో జరిగే సింగరేణి పరిరక్షణ యాత్రను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రంగా, సదానందం, వెంకటేశ్వర్లు, రాణి తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులను ఖండించాలి

అశ్వారావుపేట: ఆశ వర్కర్లను అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, ముల్కలపల్లి మండలాల్లో ఆశ వర్కర్లను అరెస్టు చేయడం పట్ల ఆయన స్పందించారు. ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకునేందుకు హైదరాబాద్ వెళుతున్నవారిని అరెస్టులు చేయడం ఏం ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. గడిచిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా చేస్తే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు.

ములకలపల్లి: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు అన్నారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'చలో హైదరాబాద్'కు బయలుదేరిన ఆశావర్కర్లు నాగలక్ష్మి, పద్మ, కొండమ్మ, ఈశ్వరమ్మ, పద్మ అరెస్టులను ఖండించాలని పిలుపునిచ్చారు. ధనలక్ష్మి, నాగలక్ష్మి, పద్మ, ఈశ్వరమ్మ తదిరరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ పండుగ


తీజ్ వేడుకల ఊరేగింపులో ఎస్సై, మహిళలు

చంద్రుగొండ: మండలంలోని వెంకటియతండాలో ఆదివారం సాయంత్రం తీజ్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ మేరామయాడి తీజ్ పండుగను గిరిజనులు సంప్రదాయంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులపాటు గోదుమలను నానబెట్టి గ్రామంలోని యువతులు ఆకుకూరలతో సేవ చేశారు. గ్రామంలో ఊరేగింపు చేసి నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ గంజి స్వప్న, మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, బాణోత్ బాబులాల్, భద్రునాయక్, వీరన్ననాయక్ పాల్గొన్నారు.

భవనాన్ని అందుబాటులోకి తేవాలి

ములకలపల్లి: మండలకేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీ పరిధిలోని నూతనంగా నిర్మించిన భవనాన్ని రోగులకు అందుబాటులోకి తేవాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. ములకలపల్లిలో పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సమావేశంలో నిమ్మల మధు, ఊకంటి రవికుమార్, గడ్డం వెంకటేశ్వర్లు, రవీందర్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.